

ఘనంగా ధ్వజస్తంభ ఆరాధన
పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభ మండల ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. -8లో..



వైఎస్సార్‌టీయూసీ కార్మికుల పక్షపాతి
వైఎస్సార్‌టీయూసీ కార్మికుల పక్షపాతి అని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. -8లో..

గరిష్టం/కనిష్టం
38.3/25.1
వాతావరణం
జిల్లాలో మంగళవారం 25.1 – 38.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధ (సా॥)	సహర్ గురు (ఉ॥)
కడప	6.30	4.58
ప్రొద్దుటూరు	6.28	5.02
పులివెందుల	6.33	5.03

న్యూస్‌రీల్


31న జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళాలను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధికల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్లిప్ కార్ట్ కంపెనీలో డెలివరీ బాయ్, అలీ డిక్సన్ కంపెనీలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, డిప్లొమో ఇంజనీర్ ట్రైనీ, అసెంబుల్ ఆపరేటర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, బిటెక్, ఎంబీఏ చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. 19–40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోలు తీసుకుని ఈనెల 31న తమ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఎంపికైన వారికి రూ.10,000 నుంచి రూ.25,000 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని ఆమె కోరారు.

మే 1 నుంచి 30 వరకు వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు

కడప స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు మేనెల 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లాలో క్రీడాశిక్షణ శిబిరాలను నిర్వహించనున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎన్.వి.పి. అమృత్‌రాజ్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మొత్తం 50 వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసి అన్ని క్రీడా విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 8 నుంచి 14 సంవత్సరాలలోపు వయసు కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు ఆసక్తి గల క్రీడాసంఘాల ప్రతినిధులు, స్వచ్ఛందసంస్థల, ఎస్‌జీఎఫ్ ఫిజికల్ డైరెక్టర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు ఏప్రిల్ 4వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుల్లో క్రీడాంశం, నిర్వహించే ప్రదేశం, మండలం, నియోజకవర్గం, గ్రామీణ/పట్టణ శిబిరం, నిర్వహించే వారి పేరు, హోదాను తెలియజేస్తూ దరఖాస్తులను కడప కలెక్టరేట్‌లోని డీ బ్లాక్‌లోని స్టెప్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు 63006 64935 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

వయోజన విద్య జిల్లా ఉపసంచాలకుడిగా సుబ్బారెడ్డి



కడప కోటిరెడ్డిసర్కిల్: వయోజన విద్య జిల్లా ఉపసంచాలకుడిగా మల్లు వెంకట సుబ్బారెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మహమ్మద్ ఆజాద్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. అనంతరం వెంకట సుబ్బారెడ్డికి అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. సుబ్బారెడ్డి సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయరామరాజును మర్యాదపూర్వకంగా కలిశారు.

సేంద్రీయ పంటల పరిశీలన



బయో రీసోసర్స్ సెంటర్ పనితీరును తెలుసుకుంటున్న ఫిలిప్పీన్స్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిధిలోని కల్లూరు, తాళ్లమాపురం గ్రామాల్లో ఫిలిప్పీన్స్ యాక్సిస్ అగ్రికల్చరల్ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు నందిని, ధనిషా, పుదుచ్చేరికి చెందిన అరవిందో ఫౌండేషన్ నుంచి 35 మంది రైతులు మంగళవారం ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తున్న పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లూరులో ప్రొద్దుటూరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో సర్పంచ్ వల్లూరు శివలక్ష్మీ నాగేంద్రరెడ్డి సాగు చేస్తున్న వరి పంటను వారు పరిశీలించారు. బయోరీసోర్సెస్ సెంటర్‌ను సందర్శించి తయారు చేస్తున్న బయోఫర్టిలైజర్స్, కషాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం రాష్ట్ర కోఆర్డినేటర్ ఆదినారాయణ, ప్రొద్దుటూరు రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ సీఈఓ పవన్‌కుమార్, అగ్రికల్చరల్ ప్రోగ్రాం ఆఫీసర్ రవితేజ, బ్లాక్ కోఆర్డినేటర్ మునిలక్ష్మి, కిసాన్ మిత్ర ఫీల్డ్ కోఆర్డినేటర్ జయన్న పాల్గొన్నారు.

భక్తాగ్రేసరుడు.. రామదాసుడు!

మాల ఓబన్న (భవనాసి ఓబులదాసు) ఒక దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి. రామభక్తుల్లో ఒకడిగా గుర్తింపు పొందాడు. రామయ్యపై పాటలు పాడిన కారణంగా నాడు తీవ్ర వివక్షకు గురయ్యాడు. తన భక్తునికి జరిగిన అవమానంతో ఖిన్నుడైన స్వామి గర్భగుడిలో తన దిక్కును మార్చుకున్నాడని చరిత్ర చెబుతోంది. అప్పటి నుంచి ఓబులదాసు శ్రీరాముడి అపరభక్తునిగా నిలిచిపోయాడు.

- వావిలికొలను కన్నా ముందే రామభక్తుడు ఓబులదాసు
- ఓబన్న కీర్తనలవైపే 'రామయ్య'చూపు!
- గరుడోత్సవంలో ఓబన్నకు హారతి
- వారసులకు లభించని గౌరవం



సీతా,రామ,లక్ష్మణ మూలవిరాట్టు



రామాలయం ఎదురుగా ఉన్న మాలఓబన్న మంటపం

రాజంపేట: ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయానికి తూర్పు వైపున మాల ఓబన్న మంటపం కనిపిస్తుంది. ఇది రామ భక్తుడు భవనాసి ఓబులదాసు మంటపం. ఈయన వైష్ణవభక్తుడు. భవనాశి ఓబన్న ఆయన పూర్తిపేరు. నిత్యం ఈ గుడి సమీపంలో ఉంటూ స్వామి భజనలు చేసేవాడు. అంటరానివాడు.. దూరంగా నెట్టండి అని ఒక అధికారి ఓబన్నను ఆలయం పడమర వైపునకు నెట్టించాడు. ఓబన్న అక్కడున్న మంటపంలో నిలబడి పాటలు పాడుతూనే ఉన్నాడు. ఆ రాత్రి అలాగే సాగింది. ఉదయం అర్చకులు ఆలయ తలుపులు తెరవగా సీతారామలక్ష్మణ విగ్రహాలు పడమర వైపునకు తిరిగి ఉండటాన్ని గమనించాడు. తన భక్తుడైన ఓబన్నను అవమానించారనే కారణంగా స్వామి ఇలా తన దిక్కును మార్చుకున్నాడని చరిత్ర ద్వారా తెలుస్తోంది.

అక్కడ రామదాసు..ఇక్కడ ఓబులదాసు.

తెలంగాణలోని భద్రాద్రి రామయ్యకు అపరభక్తునిగా రామదాసు చరిత్రలో నిలిచిపోయాడు. అలాగే ఒంటిమిట్ట రామయ్య భక్తుడిగా ఓబులదాసు కూడా చరిత్రలో నిలిచిపోయినప్పటికి ఆయనకు తగినంత ప్రాచుర్యం లభించలేదు. ఓబులదాసు రామయ్యపై కీర్తనలు ఆలపించాడని.. అయితే వాటిని రాతరూపంలో భద్రపరిచి ఉంటే ఈరోజు మరో అన్నమాచార్యునిగా ప్రసిద్ధికెక్కేవాడని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఓబులదాసు (నమూనాచిత్రం)

ఓబన్న పుట్టుపుర్వోత్తరాలు..

ఒంటిమిట్టకు క్రోసుడు దూరంలో మలకాటిపల్లె హరిజన కుటుంబంలో భవనాసి ఓబులదాసు(మాల ఓబన్న) జన్మించాడు. వావిలికొలను సుబ్బారావు కన్నా ముందుగా రామభక్తుల వరుసలో ముందున్నాడు. ప్రతి నిత్యం పాటలు పాడుకుంటూ రాముని కైంకర్యంలో జీవించాడు. ఈయన గురించి తిరుమల తిరుపతి దేవస్థానం పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. కాగా బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున హారతి, బియ్యం, పసుపు, కుంకుమ వంటి పూజా సామగ్రి తమ వంశంవారి నుంచి స్వీకరించాలని ఓబన్న కోరినట్లు తెలుస్తోంది.

అవమానించిన అధికారికి కలలో..

ఓబన్నను అవమానించిన ఆ అధికారికి కలలో కోదండరామస్వామి కనిపించి మందలించాడు. ఉదయాన్నే అధికారి ఓబన్నను వేడుకొంటూ గుడి వద్దకు వచ్చాడు. స్వామి తూర్పు వైపు తిరిగి కనిపించాడు.

గరుడోత్సవం రోజున..

బ్రహ్మోత్సవాల సమయంలో గరుడోత్సవం నాడు స్వామి ఊరేగింపు బయటకు వచ్చినప్పుడు ఓబన్న స్వామికి హారతి పట్టడం నేటికి సంప్రదాయబద్ధంగా కొనసాగుతోంది.

ఓబన్న వంశీకులకు గౌరవమేదీ..

ఓబన్న వారసుల విషయంలో దేవదాయశాఖ గతంలోనూ, ఇప్పుడు టీటీడీ అదే తీరును అవలంబిస్తోందని దళితసంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. వావిలికొలను సుబ్బారావు చరిత్ర తరహాలో ఓబులదాసు చరిత్రను బయటకు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందంటున్నారు.

పూర్వం నుంచి..

పూర్వం నుంచి ఆలయ నిర్వాహకులు ఓబన్న వంశీకులకు టెంకాయ, ఐదుపావుల బియ్యం, పూలదండ, కేజీనూనె ఇచ్చేవారు. గత కొంతకాలంగా రూ.3వేలు నగదు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు.

కల్యాణ వేదికపై ఓబన్న వారసులకు స్థానమేదీ?

కల్యాణ వేదికపై అన్నమయ్య వారసులను గౌరవించే తరహాలో ఓబన్న వారసులకు టీటీడీ నుంచి పిలుపులేదు. ఈ సారి స్వామివారి కల్యాణంలో మాలఓబన్న వంశస్తులకు పెద్దలతో పాటు స్థానం కల్పించాలనే డిమాండ్ దళిత నేతల నుంచి వినిపిస్తోంది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలన్న భావన వారిలో కనిపిస్తోంది.

ఓబులదాసు వారసులుగా జన్మించడం పూర్వజన్మ సుకృతం



ఓబులదాసు వారసులుగా జన్మించడం పూర్వజన్మ సుకృతం. తరతరాలుగా రామయ్య బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం గాలిగోపురం (తూర్పు) ఎదుట పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను కొనసాగిస్తున్నాం. మమ్మల్ని వారసులుగా గుర్తించి స్వామి వారి కల్యాణ వేదికపై అవకాశం కల్పించాలి. -భవనాసి కాటయ్య, ఓబన్న వారసుడు

ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



రామదాసు తరహాలోనే ఓబులదాసు కూడా అపర రామభక్తుడు. అలాంటి భక్తునికి గుర్తింపు, ప్రాచుర్యం కల్పించడంలేదు. కనీసం విగ్రహమైనా ఏర్పాటు చేయాలి. -భవనాసి సుబ్బన్న, ఓబన్న వారసుడు

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ఒంటిమిట్ట: ఆంధ్రాభద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామాలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం టీటీడీ ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరిగింది. ఉదయం 5:00 నుంచి 5:30 వరకు సుప్రభాతం, 5:30 నుంచి 6 వరకు ఆలయ శుద్ధి, ఆరాధన, 6 నుంచి 7 గంటల వరకు సర్వదర్శనం, 7 నుంచి 7:30 గంటల వరకు ఆలయాన్ని నీటితో శుద్ధి చేశారు. అనంతరం ఆలయం ఎదురుగా వెలసిన సంజీవరాయుడు స్వామి ఆలయాన్ని కూడా ఆ పవిత్ర జలాలతో శుద్ధి చేశారు.

- ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు స్వామి వారి దర్శనం నిలిపివేశారు. తిరిగి 11 గంటల తరువాత నుంచి యధావిధిగా భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడు, టీటీడీ సిబ్బంది ప్రవీణ్, రాజేంద్రనాయక్, అర్చకులు వీణారాఘవాచార్యులు, నరసింహాచార్యులు, శ్రావణ్ కుమార్, పవన్ కుమార్, మనోజ్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పవిత్ర జలంతో బలిపీఠాన్ని, ధ్వజస్తంభాన్ని శుద్ధి చేస్తున్న ఆలయ డిప్యూటీ ఈఓ

స్వామి పాదాలను తాకిన సూర్యకిరణాలు



రాయచోటిటౌన్ : రాయచోటిలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం స్వామి విగ్రహ పాదాలను సూర్యకిరణాలు తాకాయి. కిరణాలు స్వామి వారి ఆలయ ముఖ ద్వారం ద్వారా నేరుగా గర్భగుడిలోని స్వామి వారి పాదాలను స్పృశిస్తూ నాభి వరకు వెళ్లాయి. సుమారు పదిహేను సెకన్ల పాటు స్వామి వారి పాదాలను తాకాయి. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

రైల్వేశాఖ మంత్రి దృష్టికి రైళ్ల హాల్టింగ్ సమస్య

రాజంపేట: రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఐదు రైల్వేస్టేషన్లలో పలు రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను రాజంపేట లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి కోరారు. మంగళవారం రైల్వేశాఖమంత్రితో ఆయన కార్యాలయంలో ఎంపీ భేటీ అయ్యారు. హాల్టింగ్స్‌కు సంబంధించి పూర్తి వివరాలతో మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్‌కు ముందు ఏ రైళ్లకు హాల్టింగ్స్ ఉన్నాయో వాటన్నింటిని పునరుద్ధరించాలని, అలాగే రైల్వేకోడూరు, ఓబులవారిపల్లెలో ఆర్‌యూబీ నిర్మించాలని కోరామన్నారు. ఇందుకు రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

సమిష్టి కృషితో బ్రహ్మోత్సవాల నిర్వహణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట మండలంలో గల అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల విజయంతానికి సమష్టిగా కృషి చేయాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ఆదేశించారు. ఎంపీపీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే వేలాది భక్తులకు అత్యవసర చికిత్స అందించేందుకు ఎల్లవేళలా మండల వైద్యాధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు మేడా కన్‌స్ట్రక్షన్స్ తరపున దాదాపు 80 వేల అన్నప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు. ఒంటిమిట్టలో నిత్య కల్యాణం జరుగుతున్న సందర్భంగా కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన వేదికపై దాదాపు 3 పెళ్లిళ్లు చేసుకోవచ్చన్నారు. ఇందుకు టీటీడీకి రూ. 10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా పెళ్లికి నెల ముందే మేడా కన్‌స్ట్రక్షన్స్ వారితో మాట్లాడి నమోదు చేసుకుంటే టీటీడీకి చెల్లించాల్సిన మొత్తం రూ 10 వేలను తామే చెల్లిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు 22,257 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షకు 22,257 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాలోని 92 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన రసాయనశాస్త్రం, వాణిజ్యశాస్త్రం, ఒకేషన్ పరీక్షలకు సంబంధించి 23,351 మంది విద్యార్థులకుగాను 22,257 మంది హాజరు అయ్యారు. రాయచోటి ప్రాంతంలోని పలు పరీక్షా కేంద్రాలలో చూచిరాతలకు పాల్పడిన 5 మంది విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆర్ఐఓ రమణరాజు తెలిపారు.

సమన్వయంతో పని చేయండి

కడప సిటీ : గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయ రామరాజు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తో కలిసి జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహించే వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష చేశారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణ అందించాలి

చిన్న పిల్లలకు, గర్భిణీలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ తప్పకుండా పంపిణీ చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ విజయ రామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథక అమలుపై ఓఎస్డీ రఘునాథ్, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, సూపర్‌వైజర్లతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ప్రాధాన్యతా రంగాలు మరింత పటిష్టం

అన్ని ప్రాధాన్యతా రంగాలను మరింత పటిష్టం చేయాలని కలెక్టర్ విజయ రామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో కలెక్టర్ అధ్యక్షతన అన్ని రకాల ప్రాధాన్యతా రంగాలకు చెందిన జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వర రావు, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రారెడ్డి, డీసీఓ సుభాషిణి, అధికారులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్ పుస్తకం ఆవిష్కరణ

వివేకానంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పదవ తరగతి విద్యార్థులకు రూపొందించిన కెరీర్ గైడెన్స్ పుస్తకాన్ని, తమ సంస్థ గౌరవ సలహాదారులు రాజోలి శ్రీధర్ రెడ్డి రూపొందించిన సంస్థ బ్రోచర్ ను కలెక్టర్ విజయరామరాజు తన చాంబర్‌లో ఆవిష్కరించారు.

సరస్వతీ పుత్రుడికి ఘన నివాళి



పుట్టపర్తి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ రామరాజు

కడప సిటీ : సరస్వతీ పుత్రుడు పుట్టపర్తి నారాయణాచార్యులని కలెక్టర్ విజయ రామరాజు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతి వేడుకలు కలెక్టర్ అధ్యక్షతన జరిగాయి. ఈ కార్యక్రమానికి డీఆర్వో గంగాధర్ గౌడ్ తో పాటు జిల్లా పర్యాటకాధికారి మల్లిఖార్జున హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆయన రచించిన శివతాండవం రచనకు కేంద్ర సాహిత్య అవార్డు లభించిందన్నారు. ఆంగ్లంలో లీవ్స్ ద విండ్, ది హీరో మొదలైన ప్రఖ్యాతి చెందిన గ్రంథాలను రచించారన్నారు. ఆయనకు పర్షియన్ భాషలో చక్కని ప్రావీణ్యం కలదన్నారు. అలాగే 14 భాషలు తెలిసిన బహుభాషా కోవిదులన్నారు. అంతకు ముందు వారు పుట్టపర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జేడీ నాగేశ్వర్ రావు, ఎస్‌బిసి విజయకుమార్, సీపీఓ వెంకట్రావు, కలెక్టరేట్ ఏఓ విజయ కుమార్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సుభాషిణి పాల్గొన్నారు.

మహాకవి 'పుట్టపర్తి': ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



నివాళి అర్పిస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్: తెలుగు పదాలతో 'శివతాండవం' ఆడించి, తెలుగు సాహితీకారుల్లో అగ్రగణ్యుడుగా నిలిచిన మహాకవి పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ కొనియాడారు. మంగళవారం పుట్టపర్తి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఎస్పీ ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి. కృష్ణారావు, ఏ.ఆర్. డీఎస్పీ బి. రమణయ్య, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్‌నాయక్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వివాహిత అదృశ్యం


నాగ సిందూరి(ఫైల్‌)

చాపాడు : ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన కత్తి నాగ సిందూరి(30) అనే వివాహిత రెండు రోజులుగా కన్పించటం లేదని బాధిత కుటుంబీకులు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కేసీ రాజు తెలిపారు. మైదుకూరు మండలంలోని ఉత్సలవరం గ్రామానికి చెందిన నాగ సిందూరికి పదేళ్ల క్రింద చాపాడు మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహమైందన్నారు. జీవనోపాధి కోసం నాగ సిందూరి భర్త విదేశాలకు వెళ్లగా.. ఇటీవలనే ఇంటికి వచ్చిన ఆయన కొన్ని రోజుల తర్వాత మళ్లీ విదేశాలకు వెళ్లాడన్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా నాగ సిందూరి కన్పించకపోవటంతో కుటుంబీకులు ఫిర్యాదు చేశారని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ప్రొద్దుటూరు రూరల్‌ ఎస్‌ఐ బదిలీ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్‌ ఎస్‌ఐ సంజీవరెడ్డిని ఉన్నతాధికారులు బదిలీ చేశారు. కడప ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాల్సిందిగా మంగళవారం రాత్రి ఉత్తర్వులు అందడంతో ఎస్‌ఐ రిలీవ్‌ అయ్యారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్న కర్ణాటక డీజిల్‌, బయోడీజిల్‌ విషయంలో ఆరోపణలు రావడంతో ఎస్‌ఐ బదిలీ అయినట్లు తెలుస్తోంది. ఇటీవల ఇవే ఆరోపణలపై రూరల్‌ సీఐగా పని చేస్తున్న మధుసూదన్‌గౌడ్‌, ఏఎస్‌ఐ అహమ్మద్‌బాషాను వీఆర్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే.

మతిస్థిమితంలేని యువతి అప్పగింత


యువతిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్‌ఐ చిరంజీవి

పులివెందుల టౌన్‌ : ఒంటరిగా తిరుగుతున్న మతి స్థిమితం లేని యువతిని పోలీసులు మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించారు. పులివెందుల పట్టణంలోని కడప రోడ్డులో పది రోజుల నుంచి పెండ్లిమర్రి మండలం బాలయ్యగారిపల్లెకు చెందిన లక్ష్మీప్రసన్న అనే మతి స్థిమితం లేని యువతి తిరుగుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు పోలీసులకు సమాచారం ఇచ్చి అర్బన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఆ యువతిని అప్పగించారు. ఎస్‌ఐ చిరంజీవి చొరవ తీసుకుని యువతి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారికి అప్పగించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నియమాలు పాటిద్దాం..
సురక్షితంగా ప్రయాణిద్దాం

పెరుగుతున్న వాహనాలు.. నిర్లక్ష్య చోదకం.. మద్యం తాగి వాహనాలు నడపడం.. తదితర కారణాలతో రోజు రోజుకు రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. వీటిని నియంత్రించాలంటే ట్రాఫిక్‌ నిబంధనలు విధిగా పాటించాలి.. వాహనాల వేగానికి కళ్లెం వేయాలి. నిదానమే నినాదం కావాలి.

- రహదారి భద్రత నియమాలు పాటించని వాహనదారులు
- నియంత్రణ కోల్పోయి నిత్యం ఏదో చోట ప్రమాదాలు
- 2019 నుంచి ఇప్పటి వరకు 1541 మంది మృత్యువాత


ఊటుకూరులోని రవాణా శాఖ కార్యాలయం

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌ : జిల్లాలో రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి. పలు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వాహనాలు నడపడంలో నిర్లక్ష్యం, లైసెన్స్‌ లేకుండా, రిజిస్ట్రేషన్‌ చేయించకుండానే తిప్పడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయడం, మద్యం సేవించి నడపడమే ఇందుకు ప్రధాన కారణాలుగా తెలుస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు 34 ఏళ్లుగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏటా వాహనచోదకులకు రహదారుల్లో సురక్షిత డ్రైవింగ్‌, ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

50 శాతం మందికే డ్రైవింగ్‌ లైసెన్స్‌లు

కడప, ప్రొద్దుటూరు, రవాణాశాఖ పరిధిలో అన్ని రకాల వాహనాల సంఖ్య సుమారు 9,97,898 ఉన్నాయి. కానీ డ్రైవింగ్‌ లైసెన్స్‌లు మాత్రం వాహనాలతో పోల్చి చూస్తే సుమారు 50 శాతం కూడా లేవు. రవాణాశాఖ డ్రైవింగ్‌ లైసెన్స్‌ ప్రతి వాహన చోదకుడు కలిగి ఉండాలని ఏటా ఎన్నో అవగాహన కార్యక్రమాలు, ఎల్‌ఎల్‌ఆర్‌ మేళాలు నిర్వహిస్తున్నా ఫలితం లేకపోతోంది. రవాణా శాఖ డ్రైవింగ్‌ లైసెన్స్‌ ప్రక్రియను సులభతరం చేయాలని ఎల్‌ఎల్‌ఆర్‌ పరీక్ష ప్రమాణికంగా ఉన్న కనీస విద్యార్హత కూడా మినహాయింపు చేసింది.

2019 నుంచి..

2019 నుంచి 2023లో ఇప్పటి వరకు 1541 మంది మృత్యువాత పడ్డారు. ఇందులో 2019లో మొత్తం 1320 ప్రమాదాలు జరగగా 320 మంది మృత్యువాత పడగా 1613 మంది గాయపడ్డారు. 2020లో 762 ప్రమాదాలు జరగగా 266 మంది మృతి చెందగా, 920 మంది గాయాలపాలయ్యారు. 2021లో 801 ప్రమాదాలు జరగగా 317 మంది మృతి చెందగా 913 మంది గాయపడ్డారు. 2022లో 738 ప్రమాదాలు జరగగా 357 మంది మృత్యువాత పడగా 794 మంది గాయాల పాలయ్యారు. 2023లో ఇప్పటి వరకు 94 ప్రమాదాలు జరగగా 61 మంది మృతి చెందగా 111 మంది గాయపడ్డ వారిలో ఉన్నారు.

ఇవి పాటించాలి

- వాహన చోదకులు రహదారుల్లో ఏర్పాటు చేసిన వేగ నియంత్రణ సూచిక బోర్డుల ఆధారంగా వాహనాలను నడపాలి.
- డ్రైవింగ్‌ లైసెన్స్‌ ప్రతి వాహన చోదకుడు కలిగి ఉండాలి.
- మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదు.
- సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ డ్రైవింగ్‌ చేయకూడదు.
- మద్యం సేవించి వాహనాలు నడుపరాదు.
- ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్‌ విధిగా ధరించాలి
- కార్లు నడిపే చోదకులు సీటు బెల్ట్‌ పెట్టుకోవాలి
- ద్విచక్ర వాహనాల్లో త్రిబుల్‌ డ్రైవింగ్‌ ప్రమాదకరం, నేరం.
- వాహనాలకు, ఆర్సీ, ఎఫ్‌సీ, భీమా, పొల్యూషన్‌ సర్టిఫికెట్లు ఉండాలి.
- రహదారులపై ద్విచక్ర వాహన చోదకులు రైడింగ్‌ వంటి ఫీట్లు చేస్తే శిక్షార్హులు.

వైఎస్‌ఆర్‌ జిల్లాలో రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	గాయపడ్డ వారు
2019	1320	540	1613
2020	762	266	920
2021	801	317	913
2022	738	357	794
2023 ఇప్పటి వరకు	94	61	111

నియమాలు పాటించాలి



ప్రతి వాహనాదారుడు ప్రభుత్వం సూచించిన రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి. ప్రతి వాహనాదారుడు డ్రైవింగ్‌ లైసెన్స్‌ కలిగి ఉండాలి. వాహనదారులకు రోడ్డు భద్రతా నియామాలపైన అవగాహన లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను నివారించాలంటే రోడ్డు భద్రతా నియామాలను పాటించాలి. – ఇ. మీరాప్రసాద్‌, డీటీసీ, కడప

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

రాజంపేట : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఏఐటీఎస్‌ అధినేత చొప్పా గంగిరెడ్డి అన్నారు. స్థానిక ఏఐటీఎస్‌లో నాలుగో సంవత్సరం కంప్యూటర్‌ సైన్స్‌ అండ్‌ ఇంజనీరింగ్‌ విద్యార్థుల వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లపాటు చదివిన చదువుకు ఫలితం ఉద్యోగం సాధించడం మాత్రమేకాదని, ఉన్నతమైన ఆశయాలతో సమాజానికి, దేశానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వడం కూడా అన్నారు. వైస్‌చైర్మన్‌ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ ఎంత ఎత్తుకు ఎదిగినా తల్లిదండ్రులను, సమాజాన్ని, దేశాన్ని మరిచిపోరాదన్నారు. ప్రిన్సిపాల్‌ నారాయణ మాట్లాడుతూ కృషి, పట్టుదలతో దేనినైనా సాధించగలరన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌వోడీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

రైల్వేకోడూరు అర్బన్‌ : రైల్వేకోడూరు పట్టణంలోని రాజ్‌రెసిడెన్సీ వద్ద మంగళవారం రాత్రి లారీ ఢీకొని బాలగోవర్ధన్‌ (32) అనే యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చియ్యవరానికి చెందిన రాజారావు కుమారుడు బాలగోవర్ధన్‌ కొన్ని నెలలుగా పట్టణంలోని ఉంగరాల నగర్‌లో నివాసం ఉంటున్నాడు. రాజ్‌రెసిడెన్సీ దారి నుంచి నడిచి వెళుతుండగా కడప నుంచి తిరుపతికి వెళ్తున్న సిమెంట్‌ రవాణా లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు సంఘటనా స్థలంలోనే కుప్పకూలిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌టీయూసీ కార్మికుల పక్షపాతి

- ఘనంగా ఆవిర్భావ దినోత్సవం
- పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పార్టీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి


వైఎస్సార్‌టీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్‌ : వైఎస్సార్‌ ట్రేడ్‌ యూనియన్‌ (వైఎస్సార్‌టీయూసీ) కార్మికుల పక్షపాతిగా ఉండి, వారి సమస్యల కోసం పోరాటం చేయడం వల్లే గుర్తింపు సాధించిందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కె.సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేసి, దివంగత వైఎస్సార్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ కట్‌ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు మేలు చేయాలంటే ఒక్క వైఎస్సార్‌టీయూసీకే సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిత్యం కార్మికుల సంక్షేమం కోసం పని చేస్తోందన్నారు. ఆటో కార్మికుల కోసం ప్రతి ఏడాది రూ.10 వేల ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. టైలర్లు, రజకులను కూడా కార్మికులుగా గుర్తించి రూ.10 వేల సాయం అందించడం జరుగుతోందన్నారు. ఔట్‌ సోర్సింగ్‌ కార్మికుల కోసం ఔట్‌ సోర్సింగ్‌ కార్పొరేషన్‌ ఏర్పాటు చేసి పారదర్శకంగా వేతనాలు ఇస్తున్నారన్నారు. కార్మికుల సంక్షేమంపై ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కార్మికవర్గం అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్‌, ఏపీ సోషల్‌ వెల్ఫేర్‌ బోర్డు చైర్మన్‌ పులి సునీల్‌, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.జాషువా, నగర అధ్యక్షుడు నాగరాజు, మెడికల్‌ అండ్‌ హెల్త్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు వెంగళరెడ్డి, ఎస్సీసెల్‌ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ వినోద్‌, సుభాన్‌బాషా, మహిళా నేతలు రత్నకుమారి, బండి మరియలు, టీపీ వెంకట సుబ్బమ్మ, క్రిష్ణవేణి, సునీత, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు వెంకటసుబ్బయ్య


వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ

బద్వేలు అర్బన్‌ : వైద్యునిగా, శాసనసభ్యుడిగా నిరాడంబర జీవితాన్ని గడిపిన దివంగత నేత, బద్వేలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ జి.వెంకటసుబ్బయ్య నేటితరం నాయకులకు ఆదర్శమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ పేర్కొన్నారు. దివంగత నేత డాక్టర్‌ జి.వెంకటసుబ్బయ్య ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్‌ మానిటరింగ్‌ కమిటీ మెంబర్‌ సి.నారాయణ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తెలుగుగంగ కాలనీలోని నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేసి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన డాక్టర్‌ జి.వెంకటసుబ్బయ్య వైద్యునిగా, శాసనసభ్యుడిగా రాణించడంలో ఎంతో కృషి దాగి ఉందని తెలిపారు. ఆయన ఆశయసాధనకు కలిసికట్టుగా కృషి చేస్తామని పేర్కొన్నారు. తొలుత వెంకటసుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిరాశ్రయుల వసతిగృహం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అడా చైర్మన్‌ సింగసాని గురుమోహన్‌, పౌరసరఫరాల సంస్థ కార్పొరేషన్‌ డైరెక్టర్‌ సుందర్‌ రామిరెడ్డి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ గోపాలస్వామి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ పుత్తా లక్ష్మీదేవి శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్‌ యద్దారెడ్డి, గోపవరం సచివాలయాల కన్వీనర్‌ పుల్లయ్య, కౌన్సిలర్లు సత్యం, మహేష్‌, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, మౌలాలి, సాంబశివారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హిజ్రా దుర్మరణం

– మరో హిజ్రాకు తీవ్ర గాయాలు


మృతుడు మహేష్‌ అలియాస్‌ మనీషా

కడప అర్బన్‌ : కడప నగర శివారులోని చిన్నచౌక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం రాత్రి వైఎస్‌ఆర్‌ లే ఔట్‌ వెళ్లేదారి సమీపంలో తిరుపతి– తాడిపత్రి బైపాస్‌ రోడ్డులో భిక్షాటన చేస్తున్న ఇద్దరు హిజ్రాలను గుర్తుతెలియని లారీ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో మహేష్‌ అలియాస్‌ మనీషా (22) అనే హిజ్రా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో హిజ్రా ఆది వెంకటేష్‌ అలియాస్‌ రాధ (23) తీవ్రంగా గాయపడ్డాడు. వీరిని స్థానికులు రిమ్స్‌కు తరలించారు. మహేష్‌ అలియాస్‌ మనీషాది శ్రీసత్యసాయిజిల్లా తలుపుల మండలం వేములగొంది గ్రామం. కొంత కాలంగా కడప నగర శివారులోని తిలక్‌నగర్‌లో తన సహచర హిజ్రాలతో పాటు వుంటూ జీవిస్తున్నాడు. ఆది వెంకటేష్‌ అలియాస్‌ రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలియజేశారు.

ఘనంగా ధ్వజస్తంభ మండల ఆరాధన


ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న శ్రీవెంకటాద్రిస్వామి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని జగద్గురు శ్రీమద్విరాట్‌ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ప్రాంగణంలో మంగళవారం నూతన ధ్వజస్తంభ మండల ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 15న నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. ఈ నెల 29 నాటికి 41వ రోజు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆరాధన పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మఠం ఆస్థాన సిద్ధాంతి ఇడమకంటి జనార్దన శివాచార్య బృందం ఆధ్వర్యంలో హోమాలు చేశారు. కార్యక్రమంలో మఠం ఫిట్‌ పర్సన్‌ శంకర్‌ బాలాజీ, పూర్వపు మఠాధిపతులు శ్రీవీరభోగ వసంత వెంకటేశ్వరస్వాముల కుటుంబ సభ్యులు, జ్యేష్ఠ పుత్రుడు శ్రీవెంకటాద్రిస్వామి, ధ్వజస్తంభ దాతలు, మేనేజర్‌ ఈశ్వరయ్య ఆచారి, స్వామి శిష్యులు, భక్తులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ

– తండ్రి, తనయుడికి తీవ్ర గాయాలు

రామాపురం : బైక్‌ను లారీ ఢీకొనడంతో తండ్రి, తనయుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధి చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిలోని బీసీ కాలనీ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో సూరి(28), ఆయన తనయుడు భరత్‌(4)కు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితులను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

ఓబులవారిపల్లె : గోవిందంపల్లె పంచాయతీ పోలివండ్లపల్లె దళితవాడ గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(48) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేశ్వర్లు పోలివండ్లపల్లె గ్రామ పరిసరాల్లో కూలి పనులు చేసుకొని జీవనం సాగించే వాడు. ఆయనకు శివప్రసాద్‌ అనే కుమారుడు ఉన్నాడు. ఈ నెల 24న బయటకు వెళ్లి వస్తానని ఇంటి నుంచి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. ఆయన కోసం బంధువులతో కలిసి శివప్రసాద్‌ చుట్టుపక్కల గాలించగా.. యాల్లాయపల్లె గట్టుపై శవమై కనిపించాడు. అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే తన అన్నను కుమారుడు శివప్రసాద్‌ హత్య చేశాడని అనుమానం ఉందని మృతుడి తమ్ముడు నరసింహులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

పెండింగ్‌ కేసులు పరిష్కరించాలి



నేర సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌


పాల్గొన్న పోలీస్‌ అధికారులు, సిబ్బంది

కడప అర్బన్‌ : జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిల్లో పెండింగ్‌ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్‌ అన్బురాజన్‌ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం కడప నగరంలోని పెన్నార్‌ పోలీస్‌ కాన్ఫరెన్స్‌హాల్‌లో డీఎస్పీలు, సీఐలతో వీడియోకాన్ఫరెన్స్‌ ద్వారా ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జ్‌షీట్‌ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డకాయిట్‌ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. పోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో చార్జ్‌షీట్‌ దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్‌ బెట్టింగ్‌, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. నిషేధిత గుట్కా, దేశీ అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలని ఆదేశించారు. ఎస్‌హెచ్‌ఆర్‌సీ, ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని వివరించారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్‌, స్పెషల్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ బ్యూరో అదనపు ఎస్పీ నీలం పూజిత, ఏఆర్‌ అదనపు ఎస్పీ ఎస్‌.ఎస్‌.ఎస్‌.వి కృష్ణారావు, డీపీఓ ఏఓ జ్యోతి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి పునాది ప్రాథమిక హక్కులు


సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు


జ్యోతి వెలిగిస్తున్న ప్రిన్సిపాల్‌ కె. కృష్ణారెడ్డి

వైవీయూ : ప్రజాస్వామ్యానికి పునాది ప్రాథమిక హక్కులని, వాటి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం వైవీయూ పొలిటికల్‌ సైన్స్‌ అండ్‌ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ శాఖ విభాగాధిపతి డాక్టర్‌ జి.పార్వతి ఆధ్వర్యంలో వైవీయూలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌, న్యూఢిల్లీ సహకారంతో మానవ హక్కులపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రిన్సిపాల్‌ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే మానవహక్కులు ప్రజలందరూ వినియోగించుకునేలా ఉండాలన్నారు. హక్కులతోపాటు బాధ్యతలను కూడా నిర్వర్తించడం ప్రథమ కర్తవ్యం అన్నారు. మానవహక్కుల అమలులో యూఎన్‌ఓ 2030 నాటికి ఏర్పరచుకున్న 17 లక్ష్యాలపై పవర్‌పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా అవగాహన కల్పించారు. హైదరాబాద్‌ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి కేంద్రం, సెంటర్‌ ఫర్‌ డెవలప్‌మెంట్‌ ఎకనామిక్స్‌ ఆచార్య అమీరుల్లాఖాన్‌ మాట్లాడుతూ మనదేశంలో 10 కోట్ల మంది ఆకలి ఇబ్బందులతో ఉన్నారన్నారు. రీసోర్స్‌పర్సన్‌గా హాజరైన తిరుపతి ఎస్వీయూ పొలిటికల్‌ సైన్స్‌ అండ్‌ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ ఆచార్యులు డాక్టర్‌ బి.వి.మురళీధర్‌ మాట్లాడుతూ భారత రాజ్యాంగం, మానవహక్కులు అనే అంశంపై చారిత్రక సంఘటనల పట్ల అవగాహన కల్పించారు. సీనియర్‌ న్యాయవాది ఎం.చంద్రకాంతమ్మ మాట్లాడుతూ రాష్ట్ర, జాతీయ మానవ హక్కుల కమిషన్లు పని చేసే విధానాలు, ప్రజలకు ఎలా ఉపయోగపడతాయో అవగాహన కల్పించారు. మానవ హక్కుల కార్యకర్త పి.వరలక్ష్మి మాట్లాడుతూ అంబేడ్కర్‌ రాజ్యాంగంలో చేర్చినట్లు స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఉంటే అక్కడ మానవహక్కులు అమలవుతున్నట్లని వివరించారు. సదస్సు కన్వీనర్‌ డాక్టర్‌ జి.పార్వతి మాట్లాడుతూ శిక్షణలో విలువైన అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్‌ ప్రమీళ మార్గరేట్‌, డాక్టర్‌ సతీష్‌బాబు, డాక్టర్‌ వినయ్‌కుమార్‌, డాక్టర్‌ రామయ్య, దామోదర్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.